క్లుప్తంగా

వైఎస్సార్ టీఏకు ప్రభుత్వ గుర్తింపుపై హర్షం

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14వ తేదీన గుర్తింపును ఇస్తూ జీవో 32 జారీ చేసినందుకు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ మహంకాళిరావు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. తమ సంఘానికి ప్రభుత్వ గుర్తింపు వచ్చేందుకు కృషి చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్, శాసన మండలి సభ్యులు టి.కల్పలతారెడ్డి, పి.చంద్రశేఖరరెడ్డి, యూవీ రామచంద్రారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిగా గాంధీ

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షునిగా ఎగ్గోని గాంధీని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి సత్యనారాయణ, బత్తుల దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా జి.హర్షకుమార్, తప్పెట రత్న భూషణరాజు, పద్మాల కిషోర్, షేక్ బాజీ, ఎస్పీ రామకృష్ణ, మీసాల శ్రీనివాసరావులతో పాటు మరో 12 మందిని పట్టణ కార్యదర్శులుగా, మరో 12 మందిని సహాయ కార్యదర్శులుగా నియమించారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ కమిటీలను నియమించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), పార్టీ అధ్యక్షుడు, సీఎం జగన్‌మోహన్ రెడ్డిలకు ఎగ్గోని గాంధీ కృతజ్ఞతలు తెలిపారు.

క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జక్కుల

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మచిలీపట్నంకు చెందిన జక్కుల ఆనందబాబు (జానీ)ని మరోమారు నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కె.హర్షవర్ధన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డైరెక్టర్‌గా పనిచేసిన జానీ పదవీకాలం డిసెంబర్‌తో ముగిసింది. మళ్లీ డైరెక్టర్‌గా నియమిస్తూ జీవో నంబర్ 191 ద్వారా ఆదేశాలు జారీ చేశారు. తనకు రెండోసారి ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) పదవి ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లకు జానీ కృతజ్ఞతలు తెలిపారు.

జలధీశ్వరుని ఆదాయం రూ.1,11,855

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో ఉన్న శ్రీబాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి వారి హుండీ కానుకలు శుక్రవారం లెక్కించినట్లు ఆలయ ఈవో యార్లగడ వాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలధీశ్వర స్వామి వారి హుండీ కానుకలు ఐదు నెలలకు గాను రూ.1,11,855 ఆదాయం రాగా, చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలోని శ్రీదుర్గా సోమేశ్వరరావు స్వామి ఆలయంలో 18 నెలలకు రూ.39,055 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కొల్లేటికోట ఆలయ ఈవో కేవీ గోపాల్ పర్యవేక్షణలో జరిగిన హుండీల లెక్కింపు కార్యక్రమంలో అర్చకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ వేమూరి రత్నశేఖర్, వేమూరి ప్రవీణ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాన్షీరాంకు నివాళి

మచిలీపట్నంటౌన్: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కాన్షీరాం 90వ జయంతి కార్యక్రమాన్ని నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శుక్రవారం నిర్వహించారు. బహుజన్ సమాజ్ పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాన్షీరాం చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సొడాడ బాలాజీ, పార్టీ నాయకులు కాంద్రు చిన్నా, పొలిపి రంగా, బొమ్మిడి విజయ్, జవ్వాది రాజా తదితరులు పాల్గొన్నారు.

ఖద్దరు గాంధీకి నివాళి

కోసూరువారిపాలెం(మోపిదేవి): ఖద్దరు గాంధీగా పేరుగాంచిన కోసూరు గోపాల కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందారు. సమాచారం అందుకున్న మచిలీపట్నం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖద్దరు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సింహాద్రి రామ్ చరణ్, శీలం శ్రీరాములు, కె.కొత్తపాలెం మాజీ సర్పంచ్ చందన సుబ్బారావు తదితరులు ఉన్నారు.

దేవదానంకు డాక్టరేట్

చల్లపల్లి: చల్లపల్లి సీబీసీఎన్‌సీ చర్చి పాస్టర్ రెవరెండ్ పెరికే దేవదానం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. గత 45 సంవత్సరాలుగా చల్లపల్లి, మంగళాపురం, లంకపల్లి, పాగోలు గ్రామాల్లో బాప్టిస్ట్ చర్చి తరఫున పాస్టరుగా విధులు నిర్వహిస్తున్న దేవదానం సింగపూర్ యూనివర్సిటీ నుంచి ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఒకటో వార్డులోని సీబీసీఎన్‌సీ చర్చిలో సంఘస్తులు ఆయనను సత్కరించారు.

నేడు మాట్లాం గ్రామంలో ప్రజాదీవెన

కృత్తివెన్ను: మండల పరిధిలోని మాట్లాం గ్రామ పంచాయతీలో శనివారం ఉదయం 9 గంటల నుంచి ప్రజాదీవెన కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్‌సీపీ పెడన ఇన్‌చార్జ్ ఉప్పాల రాము పాల్గొంటారని పేర్కొన్నారు.

నిజాయతీగా సేవ చేసేందుకే వచ్చా

- వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు
- ఘన స్వాగతం పలికిన ఘంటసాల మండల పార్టీ నేతలు, కార్యకర్తలు



ఘంటసాలలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖరరావు

ఘంటసాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నీతి, నిజాయతీగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల మండలస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానన్నారు. 35 ఏళ్లుగా క్యాన్సర్ వ్యాధి సర్జన్‌గా పని చేస్తున్నానని, వివిధ ప్రభుత్వ సేవల్లో 22 సంవత్సరాలు సేవలందించానన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సేవలపై తనకు అవగాహన ఉందని గుర్తించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి పిలిచి వైద్య సలహాలు అందించడానికి ఐదుగురు సభ్యులతో వేసిన కమిటీలో మాజీ ఐఏఎస్ సుజాతారావుతో పాటు తాను కూడా ఉన్నానని చెప్పారు. గ్రామీణ స్థాయిలో వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌హెచ్‌సీ, పీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రులు ఏర్పాటు చేయడమే కాక సంక్షేమంతో పాటు విద్య వైద్యంకు సీఎం జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా చాలా మందికి నాణ్యమైన విద్య, వైద్యం, కూడు, గుడ్డ అందించడమే కాక గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మొదటిసారిగా ఎంపీగా పోటీ చేస్తున్న తనకు ప్రజలు అండగా ఉండి ఎమ్మెల్యేగా రమేష్‌కు, ఎంపీగా తనకు ఫ్యాన్ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మచిలీపట్నం మెడికల్ కాలేజ్ అడిగిన వెంటనే పేర్ని నాని ద్వారా మంజూరు చేసి మాట తప్పని సీఎంగా జగనన్న ఆదర్శంగా నిలిచారన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి ఐదో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, మన ప్రాంతంలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న మీ బంధువులకు, స్నేహితులకు తెలియజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా ప్రోత్సహించాలన్నారు. తాను ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తానని చంద్రశేఖరరావు చెప్పారు. తనకు ఎంపీగా పోటీచేసేందుకు అవకాశం కల్పించిన సీఎం జగనన్నకు, ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. ముందుగా డాక్టర్ చంద్రశేఖర్‌కు, ఎమ్మెల్యే రమేష్‌కు పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో యువనేతలు సింహాద్రి వికాస్, సింహాద్రి రామ్‌చరణ్, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, ఎంపీపీ వేమూరి రజనీ కుమారి, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దిరిశం పిచ్చేశ్వరరావు, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర, సర్పంచ్‌లు రాచూరి ప్రసాద్ బాబు, గూడపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు వేమూరి రత్నశేఖర్, గల్లా గిరీష్, యడ్లపల్లి బసవయ్య, పరుచూరి రామకృష్ణ, తాతినేని కృష్ణారావు, 22 గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా పనిచేస్తా



డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

చల్లపల్లి: చిన్ననాటి నుంచి దివిసీమలో ఎంతో మంది ముస్లిం స్నేహితులతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, తాను కుల, మతాలకు అతీతంగా పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంటు ఇన్‌చార్జి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీ ముస్లింల ఆహ్వానం మేరకు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, సింహాద్రి రామ్‌చరణ్ గౌసియా మసీదును సందర్శించారు. వారికి ముస్లింలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ తండ్రి సింహాద్రి సత్యనారాయణతో తమకున్న అనుబంధాన్ని ముస్లిం పెద్దలు గుర్తు చేసుకున్నారు. కాలనీలోని ముస్లిం శ్మశాన వాటికను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను చంద్రశేఖర్ దృష్టికి మసీదు కమిటీ పెద్దలు తీసుకెళ్లగా, తన వంతు సహకారం అందిస్తానని డాక్టర్ చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, సింహాద్రి రామ్‌చరణ్‌లను ముస్లింలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెనిగళ్ల తారక జగదీష్, ముస్లీం మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ కరిముల్లా ఖాన్, హమీద్, సయ్యద్ జహీర్, అబ్దుల్ గఫార్, మహమ్మద్ సమీర్, ఆదాం, కమిటీ కార్యదర్శి మతీన్ పాల్గొన్నారు.

జగనన్న పథకాలే నన్ను ఆకర్షించాయి



డాక్టర్ చంద్రశేఖరరావు పాదాలకు నమస్కరిస్తున్న కవిత

కోసూరువారిపాలెం(మోపిదేవి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను రాజకీయాల వైపు ఆకర్షించాయని మచిలీపట్నం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో శుక్రవారం తొలిసారిగా ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పుట్టి, ఇక్కడే చదువుకున్నానని ఈ ప్రాంత అభివృద్ధికి అవకాశం కల్పించాలని కోరారు.

ప్రాణదాత డాక్టర్ సింహాద్రికి అపూర్వ స్వాగతం

తొలిసారిగా గ్రామానికి వచ్చిన డాక్టర్ చంద్రశేఖరరావుకు అపూర్వ స్వాగతం లభించింది. సనకా కవిత అనే మహిళ దూరం నుంచి చూసి పరుగు పరుగున వచ్చి డాక్టర్ చంద్రశేఖరరావు కాళ్లపై పడి ఆనంద బాష్పాలతో సంతోషం తెలిపింది. రెండేళ్ల క్రితం 'స్లీన్‌క్టమీ' వ్యాధితో ఉన్న తనకు ఆపరేషన్ చేసి ప్రాణం పోశారని, ఈ రోజున తన గ్రామంలో ఆ దేవుని దర్శించుకునే భాగ్యం కలిగిందని ఆమె ఆనందం వెలిబుచ్చింది. పూల దండవేసి పూలు చల్లుతూ స్వాగతం పలికింది. తనతో పాటు తన ఇద్దరు బిడ్డలకు వైద్యం చేసి మరో జన్మనిచ్చిన ప్రాణదాత అని కొనియాడింది. అంతకుముందు గ్రామం ప్రారంభంలో ఉన్న ఆంజనేయస్వామివారిని డాక్టర్ చంద్రశేఖర్ దర్శించుకుని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

తాళ్లపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం



కోనేరుసెంటర్: మండల పరిధిలోని తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని గిరిపురం, బోట్లవానిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఐదో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల కోసం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు వివరించారు. నవరత్నాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంచిపెట్టి వాటిపై అవగాహన కలిగించారు. సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామాల్లోని పలు సమస్యలను స్థానికులు కిట్టు దృష్టికి తీసుకురాగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి సత్వరమే సమస్యలను పరిష్కరిస్తానని బదులిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, సర్పంచ్ మధిరి అశ్విని పాల్గొన్నారు.

బంటుమిల్లి - హైదరాబాద్ ఏసీ బస్సు సర్వీసు ప్రారంభం

బంటుమిల్లి: బంటుమిల్లి నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు ఏసీ బస్సు సర్వీసును ఆర్టీసీ కృష్ణా రీజియన్ చైర్మన్ పిన్నింటి మహేష్ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. భీమవరం డిపోకు చెందిన ఏసీ బస్సు ప్రతి రోజు రాత్రి 8 గంటలకు బంటుమిల్లి బస్టాండుకు వస్తుందని ఆయన తెలిపారు. ఈ బస్సుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్త, పాత కలయికతో జోష్



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఉప్పాల రమేష్(రాము)

- జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు కలసికట్టుగా కృషి చేయాలి
- యండపల్లి గ్రామం నుంచి వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఉప్పాల రమేష్(రాము)

పెడన : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు అందరూ కలిసి పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము)అన్నారు. పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం కృత్తివెన్ను మండలం యండపల్లి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు సుమారు వంద మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ రాము వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తవారి రాకతో పార్టీలో మరింత జోష్ పెరుగుతుందన్నారు. పాత, కొత్త వారందరు కలిసి పార్టీ విజయం దిశగా పయనించేలా అడుగులు ముందుకు వేయాలన్నారు. ప్రతి ఒక్క ఓటరూ ఓటు వేసేలా చూడాలని, ప్రతి కార్యకర్త, నాయకుడు కూడా భేషజాలకు పోకుండా కష్టపడి పనిచేయాలన్నారు. పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో పి.విశ్వేశ్వరరావు(బాబ్జి), పి.సాయిరాం, వెంకన్న, నాగబాబు, మహేష్, రాజు, శివ, నాని, మహంకాళి రావు, పాండురంగారావు, ఆంజనేయులు, నాగయ్య, ప్రేమ్‌కుమార్, వెంకటేష్, పోతురాజు, దేవి, కృష్ణమోహన్, సాల్మన్‌రాజు, గంటయ్య, నరసింహారావు, శ్రీనివాసరావు, అంజిబాబు, రాంబాబు, నాగరాజు, గంగరాజు, బుచ్చం తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మైలా రత్నకుమారి, పార్టీ నాయకురాలు ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారులు తమకు ఉన్న హక్కులపై అవగాహన పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో నైతిక ప్రమాణాల కృత్రిమ మేధతో వినియోగదారులకు రక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో జేసీ మాట్లాడుతూ వినియోగదారులకు వారికి ఉన్న హక్కులపై వినియోగదారుల సంఘాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో వి.పార్వతి, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సైకం భాస్కరరావు, లీగల్ మెట్రాలజీ, తూనికల కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముస్లింలను కలిసిన పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం ముస్లింలను మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని పలు మసీదుల వద్ద ప్రార్థనల్లో పాల్గొని బయటకు వచ్చిన ముస్లింలను ఆయన కలిసి రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. పేర్ని కిట్టు వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు మొహమ్మద్ రఫీ, షేక్ మొహమ్మద్ సాహెబ్, నజాఫ్ అలీ, బాషు, రబ్బానీ, యూనస్, బాషా, అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు గుండుపాలెం విద్యార్థి ఎంపిక

కోనేరుసెంటర్: ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెయిర్ 2023-24 జాతీయ స్థాయి పోటీలకు బందరు మండలం గుండుపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి మంచే దుర్గాసాయి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో ఈనెల 11,12,13 తేదీల్లో పలమనేరులో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో అత్యంత ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయిన దుర్గాసాయిని, సైన్స్ ఉపాధ్యాయుడు బొమ్మిడి సోమేశ్వరరావును శుక్రవారం పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది,పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

438 మందికి వైద్య పరీక్షలు

మెరకనపల్లి(మోపిదేవి): జగనన్న ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సురక్ష శిబిరం సద్వినియోగం చేసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సూచించారు. మెరకనపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 438 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.శ్రీరామ్‌సాయి తెలిపారు. వైద్యులు షాహినా షేక్, రాజా ప్రణీత్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ పవన్ సిద్ధు, ఏఎన్ఎం, వలంటీర్లు సేవలు అందించారు.

పలు గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభం

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు పలు రంగాలను అభివృద్ధి చేసినట్లు అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లను ఎమ్మెల్యే రమేష్ శుక్రవారం ప్రారంభించారు. మోపిదేవి దళితవాడలో జీపీఎంపీ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లు, కొక్కిలిగడ్డ ఎన్టీఆర్ కాలనీలో జీపీఎంపీ నిధులు రూ.12.50 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.7 లక్షలు మొత్తం రూ.19.50 లక్షలతో వేసిన రెండు సీసీ రోడ్లు, కె.కొత్తపాలెంలో జీజీఎంపీ నిధులు రూ.2.39 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.7 లక్షలు మొత్తం రూ.9.39 లక్షలతో వేసిన సీసీ రోడ్డు, మెరకనపల్లిలో జీజీఎంపీ నిధులు రూ.20 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.7 లక్షలు మొత్తం రూ.27 లక్షలతో వేసిన రెండు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. యువనేత సింహాద్రి వికాస్‌బాబు, ఆయా గ్రామ సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, పలువురు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు, పీఆర్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రాజకీయ లబ్ధి కోసమే సీఏఏ

మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందేందుకే సిటిజన్ షిప్ ఎమెండ్‌మెంట్ యాక్ట్ (సీఏఏ)ను మళ్లీ తెరపైకి తెచ్చిందని పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. స్థానిక చింతచెట్టు సెంటరులో భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అబ్దుల్‌మతీన్, సీపీఎం జిల్లా నాయకుడు కొడాలి శర్మ, సీపీఐ జిల్లా నాయకులు మోదుమూడి రామారావు, లింగం ఫిలిప్, ముస్లిం మత ఆధ్యాత్మిక గురువు మౌలానా రాషద్ హుస్సేన్, ఎండీ బాషు, బాజి, అంజత్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

చల్లంగా కాపాడమ్మా..నాంచారమ్మ తల్లీ

పెదప్రోలు(మోపిదేవి): గ్రామ దేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారు ప్రజలను చల్లగా కాపాడాలని అవనిగడ్డ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు కోరారు. మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి సంబరాలను శుక్రవారం ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించారు. ప్రధాన సెంటర్‌లో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పల్లకీలో అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభించారు. దారిపొడవునా ప్రతి ఇంటి ముందు భక్తులు నీళ్ల వార పోసి అమ్మవారికి టెంకాయలు, పండ్లు, పూలు అందించి దర్శించుకున్నారు. యువనేత సింహాద్రి వికాస్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు ఆది రాంబాబు, అరజా లక్ష్మీతులసి, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ కన్వీనర్ జన్యావుల రామమోహనరావు, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గురుప్రసాద్, గ్రామ సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, తహసీల్దార్ శ్రీ విద్య పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులకు సన్మానం

పెడన: పురపాలక సంఘ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ప్రసాద్ దంపతులను పారిశుద్ధ్య కార్మిక సిబ్బంది శుక్రవారం చైర్‌పర్సన్ చాంబరులో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోను అమలు చేస్తూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పారిశుద్ధ్య కార్మికుని జీతం రూ.15వేల నుంచి రూ.21వేలు చేస్తూ అమలు చేయడానికి రెండు రోజుల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో పెడన పారిశుద్ధ్య కార్మికులు చైర్‌పర్సన్ నాగకుమారి, ప్రసాద్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాజీ ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలను అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతి

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం మోటివేషన్ తరగతి నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకుడు, ప్రముఖ మోటివేటర్ ఎ.నాగేశ్వరరావు విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టరు కె.కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఓటుహక్కుపై అవగాహన

మచిలీపట్నంటౌన్: ప్రజాస్వామ్యంలో అతి బలమైన ఆయుధం ఓటు అని, దీనిని గిరిజనులు తప్పకుండా వినియోగించుకోవాలని గిరిజన సంక్షేమశాఖ జిల్లా ప్రాధికారత అధికారి బి.ప్రకాశరావు అన్నారు. నగరంలోని 22వ డివిజన్ ముస్తాఖాన్‌పేటలో శుక్రవారం ఓటు హక్కు కలిగిన గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు ఎలా వినియోగించుకోవాలనే విషయంపై వివరించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ చైతన్య పాల్గొన్నారు.

విద్యతోనే సామాజికాభివృద్ధి

మచిలీపట్నంటౌన్: విద్యతోనే సామాజికాభివృద్ధి సాధ్యమవుతుందని స్థానిక హిందూ విద్యాసంస్థల ప్రెసిడెంట్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. స్థానిక జవ్వారుపేటలోని శ్రీ వేంకటేశ్వర ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో రూ.56 లక్షలతో నిర్మించిన శ్రావణి పురాణం వెంకట రామకృష్ణశాస్త్రి స్మారక భవనాన్ని శుక్రవారం విద్యాసంస్థల చైర్మన్ దైతా గోపాలకృష్ణశాస్త్రితో కలిసి ప్రారంభించారు.

చలివేంద్రాలు ప్రారంభం

కోడూరు: నియోజకవర్గంలోని కోడూరు, అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లో కోడూరుకు చెందిన టీఎస్సార్ గ్రూపు ఆధ్వర్యంలో చలివేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. గ్రూపు అధినేత తిరుపతి శ్రీనివాసరావు, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శౌంరి నాగరాజు మూడు చలివేంద్రాలను ప్రారంభించారు.

ఎన్నికల కోడ్ అమలుకు సహకరించండి

పార్టీ నాయకులతో ఈఆర్వో వెంకటరమణ



ఎన్నికల కోడ్ గురించి ఆయా పార్టీల నాయకులతో మాట్లాడుతున్న పెడన ఈఆర్వో వెంకటరమణ

పెడన: ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి కోడ్ అమలుకు రాజకీయ నాయకులు పూర్తి సహాయ సహకారాలను అందించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణ అన్నారు. పెడన తహసీల్దారు కార్యాలయంలోని ఈఆర్వో చాంబరులో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం ఎన్నికల కోడ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల ప్రకటన విడుదలైన తక్షణమే కోడ్ అమల్లోకి వస్తుందని, ప్రకటన రాగానే ఆయా పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, ఇతర ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను తొలగిస్తామని, లేదా ఆయా పార్టీల నాయకులు ముందుగానే తొలగించుకుంటే మరింత మంచిదని స్పష్టం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు ఇన్‌చార్జిగా పెడన ఎంపీడీవో వి.రెడ్డయ్యను నియమించినట్టు తెలిపారు. ర్యాలీలు, ప్రదర్శనలు ఏమైనా నిర్వహించాలనుకుంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఒకే రోజు, ఒకేసారి రెండు పార్టీలకు అనుమతులు ఎట్టి పరిస్థితులలో ఇవ్వడం కుదరదని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు ఇవ్వదలచిన వారు లిఖితపూర్వకంగా లేదా ఆన్‌లైన్‌లో సీ విజిల్ ద్వారా కూడా తెలియజేయడానికి అవకాశం ఉందన్నారు. ఆయా ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తామని తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఈ డెస్క్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించామన్నారు. సమావేశంలో తహసీల్దారు రాంబాబు, ఎన్నికల డీటీ కల్పన, ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పేదవారి ఆపద్బాంధవుడు జగనన్న

పెడన ఇన్‌చార్జ్ ఉప్పాల రాము



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఉప్పాల రాము

కృత్తివెన్ను: ప్రతి పేదవారిని ఆదుకునే గొప్ప మంచి మనసున్న ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పెడన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము అన్నారు. వివిధ గ్రామాలకు చెందిన 32 కుటుంబాలకు వ్యక్తులకు రూ.35 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కులను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల పక్షాన ఉండాలనే మంచి ఆలోచన కలిగిన వ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా ఉండటం ఎంతో సంతోషించాల్సిన విషయమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటున్న జగనన్నను మనమంతా ఆశీర్వదించాల్సిన సమయం ఆసన్నమైనదని, ప్రతి ఒక్కరం జగనన్నకు అండగా ఉండాలని కోరారు. చెక్కులు అందుకున్న వ్యక్తులు తమను సొంత మనిషిలా ఆదుకున్న జగనన్నకు, ఇంత తక్కువ సమయంలో లక్షలాది రూపాయలు అందజేయడంలో కీలక పాత్ర పోషించిన ఉప్పాల రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్ పాలనలో గ్రామీణ ప్రగతి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో గ్రామాలు అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లి మండలంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రారంభించారు. చల్లపల్లిలో రూ.77.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీని ప్రారంభించారు. వక్కలగడ్డలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, పాగోలులో జగనన్న కాలనీ వైపు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, లక్ష్మీపురంలో రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. అవనిగడ్డ జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యన్నారాయణ (నానీ), జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రూ.70లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

పెడన ఇన్‌చార్జి ఉప్పాలతో కలిసి శంకుస్థాపనలు చేసిన చైర్‌పర్సన్ నాగకుమారి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి, పక్కన ఉప్పాల రాము

పెడన: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారంటే చేస్తారని, ఇచ్చిన మాట ప్రకారం పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రమేష్(రాము)అన్నారు. పట్టణంలోని వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమాలలో పెడన పురపాలక సంఘ చైర్‌పర్సన్ నాగకుమారితో కలిసి ఆయన పాల్గొన్నారు. పెడన పురపాలక సంఘానికి చెందిన హెడ్ వాటర్ వర్క్స్‌లో ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులకు రూ.30 లక్షలు, కైలాసపురి హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.20లక్షలు, ముస్లిం శ్మశాన వాటిక(కబరస్తాన్) ప్రహరీ నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించడంతో ఆయా పనుల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్ లీడర్ గంగయ్య, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు, పార్టీ నాయకుడు మల్లి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.